నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | మార్చి 31, 2024 | www.navatelangana.com

భీం వర్ధంతికి కూలీలకు చెల్లించిన డబ్బులు ఇప్పించాలి

నవతెలంగాణ-కెరమెరి

జోడేఘాట్ గ్రామంలో గతేడాది 2023లో ఏర్పాటు చేసిన కుమురం భీం వర్ధంతికి కూలీలకు చెల్లించిన డబ్బులు ఇప్పించాలని జోడేఘాట్ గ్రామానికి చెందిన మల్టీ పర్పస్ వర్కర్ ఆత్రం రాజు అధికారులను వేడుకుంటున్నాడు. గతేడాది భీం వర్ధంతి సందర్భంగా జోడేఘాట్ గ్రామంలో మొక్కలు నాటడం, పరిసరాల పరిశుభ్రత తదితర పనుల కోసం పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ చెప్పడంతో 23మంది కూలీలను సమకూర్చినట్లు తెలిపారు. వర్ధంతి పూర్తి కాగానే కూలీల డబ్బులు ఇవ్వాలని సదరు పంచాయతీ కార్యదర్శిని అడగడంతో డబ్బులు లేవన్నాడని తెలిపాడు. డబ్బులు ఉంటే సర్దుబాటు చేయాలని తనకు చెప్పడంతో 23మందికి రూ.14000 తాను సొంతంగా చెల్లించనన్నారు. తరువాత ఇస్తానని పంచాయతీ కార్యదర్శి చెప్పడంతో ఇన్ని రోజులు వేచి చూశానని పేర్కొన్నాడు. ఏడాదిన్నర కావస్తున్నా నేటికి డబ్బులు ఇవ్వలేదని ఆరోపించారు. డబ్బులు ఇవ్వాలని పలు మార్లు పంచాయతీ కార్యదర్శిని అడిగినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. 6నెలలుగా మల్టీ పర్పస్ జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నానని, అధికారులు స్పందించి కూలీలకు చెల్లించిన డబ్బులు ఇప్పటికైనా ఇప్పించాల వేడుకుంటున్నాడు.

అంగన్వాడీ టీచర్లకు మహిళా సాధికారతపై అవగాహన

జన్నారం : మండలంలోని కిష్టాపూర్ అంగన్వాడీ కేంద్రంలో శనివారం అంగన్వాడీ టీచర్లకు మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారిక హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక, ఫైనాన్సిల్ లిటీరసీ లిప్సిక పలు అంశాలపై అంగన్వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. భేటీ బచావో- భేటీ పడావో పథకం, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్యవివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైమ్, మహిళ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ హెల్ప్ లైన్ 100, సీనియర్ సిటిజెన్ హెల్ప్ లైన్ నంబర్ 14567, సైబర్ క్రైమ్ 1930 ఫోక్సో యాక్ట్, నేషనల్ ఎమర్జెన్సీ, సుకన్య సమృద్ధి యోజనపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ పద్మ, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.



రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు శాయశక్తులా కృషి చేస్తానని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి మాతా ఆలయంలో జిల్లా రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రేషన్ డీలర్లు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నాంపల్లి వేణుగోపాల్ ప్రస్తావించారు. ముఖ్యంగా అన్‌లోడింగ్ చార్జీలు ఇవ్వాలని, ఐదు వేల రూపాయల గౌరవ వేతనం, 50వేల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్న డిమాండ్లను నెరవేర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు. రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర అధ్యక్షులు రాజు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి సమస్యలకు పరిష్కారం చూపే విధంగా రాష్ట్ర కమిటీ తరపున ప్రయత్నిస్తామని వెల్లడించారు.

తల్లి ఆశీర్వాదం తీసుకున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ



నవతెలంగాణ-జన్నారం

ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ శుక్రవారం రాత్రి తన స్వగ్రామమైన మండలంలోని తిమ్మాపూర్‌లో తన తల్లి కనాక భూదమ్మ ఆశీర్వాదాలు తీసుకున్నారు. టికెట్ సాధించి మొదటిసారిగా స్వగ్రామానికి వచ్చిన ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. తల్లి ఆశీర్వాదం తీసుకున్న ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులంతా పార్టీలకతీతంగా తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని గ్రామ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, ఎంపీటీసీ దర్శనాల వెంకటస్వామి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుగ్లావత్ రవి, మాజీ సర్పంచ్ కనక వెంకటస్వామి, సుగుణ కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎస్సీడబ్ల్యూయు నాయకులు



నవతెలంగాణ-మందమర్రి

కెకె 5 గని వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీడబ్ల్యూయు(ఏఐటీయూసీ) నాయకులు కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ఏఐటియూసి బ్రాంచి కార్యదర్శి, కార్పొరేట్ 11 మెన్ కమిటీ సభ్యులు శైలేంద్ర సత్యనారాయణ హాజరయ్యారు. కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఉత్పత్తి మీద పెట్టిన శ్రద్ధ కార్మికుల రక్షణ మీద పెట్టడం లేదన్నారు. గనిలో రూఫ్ బోల్టింగ్ యంత్రాలు పని చేయడం లేదని, కార్మికులకు చేతి గ్లౌజ్‌లు ఇవ్వడం లేదని తెలిపారు. రక్షణకు వాడే ప్రతి వస్తువును కార్మికులకు వెంటనే అందజేయాలని విజ్ఞప్తి చేశారు. సంస్థ లాభాలకు కారణమైన కార్మికుల రక్షణకు అవసరమైన పరికరాలను అందించాలన్నారు. కార్మికులకు ప్రాణహాని లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత యాజమాన్యానిదే అని గుర్తు చేశారు. కార్మికుల కుటుంబాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు తొలగించాలని పేర్కొన్నారు. యాజమాన్యం స్పందించకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్, కెకె 5 గని ఫిట్ సెక్రటరి గాండ్ల సంపత్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ ప్రేమ్‌లాల్, ఫిట్ కమిటీ సభ్యులు, ఏఐటీయూసీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం

బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇరాక్‌లో మృతి చెందిన దేవునిగూడ గ్రామానికి చెందిన వెంకటేష్ కుటుంబానికి తెలంగాణా గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో శనివారం రూ.5వేల ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా గల్ఫ్ సంక్షేమ సమితి నాయకులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్యం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా గల్ఫ్ కార్మికుల కొరకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవల వేములవాడ నియోజకవర్గంలో గల్ఫ్‌లో చనిపోయిన ఇద్దరి కార్మికుల కుటుంబాలకు సహాయం చేసిన విధంగా ఈ కుటుంబానికి కూడా రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రామ గౌరవ అధ్యక్షులు కునారపు భీమారాజు, అధ్యక్షులు రాగాల మలేష్, సాంబారి రవి, మేర సురేందర్, కందుల మలేష్, కొంతం సీను, నర్సయ్య, రాగాల మహేష్, కాల్వ సాయికుమార్ పాల్గొన్నారు.

మూడింటికీ ప్రధానమే..!

- దక్కించుకోవాలని కాంగ్రెస్..నిలబెట్టుకోవాలని బీజేపీ
- పట్టు నిలుపుకోవాలని బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నాలు
- గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న పార్టీలు
- విజయంపై ఎత్తులకు పై ఎత్తులు

ఆదిలాబాద్ లోక్‌సభ సమరానికి ప్రధాన పార్టీలు సమాయత్తమవుతున్నాయి. ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా.. క్షేత్రస్థాయిలో ప్రచార పర్వాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. ఇప్పటికే మండల స్థాయిలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికలకు సిద్ధమవుతుండగా.. మరికొన్ని రోజుల్లో ప్రచార రథాల ద్వారా ప్రజల్లోకి వెళ్లేందుకు సంసిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మూడు రాజకీయ పార్టీలు కూడా గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో పాగా వేసేందుకు వ్యూహాలు రచిస్తున్నాయి. క్యాడర్‌ను సమాయత్తం చేస్తున్నాయి. విజయమే లక్ష్యంగా మూడు పార్టీలు కార్యాచరణ రూపొందిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. పోలింగ్‌కు మరో నెలన్నర సమయం ఉండటంతో లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాలను చుట్టేయడానికి రంగం సిద్ధం చేసుకుంటుండటం ఆసక్తికరంగా మారుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ లోక్‌సభ సీటును కైవసం చేసుకునేందుకు మూడు ప్రధాన పార్టీలు నువ్వానేనా అన్నట్లు కదనరంగంలోకి దూకుతున్నాయి. ఎన్నికల బరిలో నిలిచి గెలవడమే లక్ష్యంగా వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఇప్పటికే మూడు పార్టీలు సైతం అభ్యర్థులను ప్రకటించగా.. వారు ప్రజా క్షేత్రంలోకి వెళ్లడమే తరువాయిగా మారింది. ప్రస్తుతం ఆయా నియోజకవర్గాల్లో పర్యటిస్తూ ముఖ్య నాయకులను కలిసి పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. ప్రచారంపై చర్చలు సాగిస్తూ విజయం కోసం శ్రమించాలని సూచనలు చేస్తున్నారు. ఇలా మూడు ప్రధాన పార్టీలు సైతం గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతుండటం ఆసక్తికరంగా మారింది.

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆదిలాబాద్ లోక్‌సభ సీటుపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కేవలం నాలుగు సీట్లు మాత్రమే గెలిచినా.. ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తల చేరికలతో ఉత్సాహంగా కనిపిస్తోంది. పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థి ఎంపికలోనూ ఆచితూచి వ్యవహరించింది. ప్రభుత్వ ఉపాధ్యాయురాలైన ఆదివాసీ, మానవ హక్కుల పరిరక్షణ కోసం పలు పోరాటాలు నిర్వహించిన ఉద్యమాలు చేపట్టిన ఆత్రం సుగుణను లోక్‌సభ బరిలో నిలిపింది. ప్రస్తుతం ఈ లోక్‌సభ పరిధిలో ఆ పార్టీకి ఒకే ఎమ్మెల్యే ఉన్నా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్ని తామై వ్యవహరిస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, విఠల్‌రెడ్డిలతో పాటు పలువురు కీలక నాయకులు కాంగ్రెస్‌లో చేరడంతో ఈ నియోజకవర్గంలో మరింత బలం పుంజుకుంది. త్వరలోనే మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సైతం హస్తం గూటికి చేరుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రస్తుతం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు సైతం ఎంపీ సీటును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన బీఆర్ఎస్ సైతం లోక్‌సభ పోరులో సత్తాచాటాలని భావిస్తోంది. ఈ పార్టీ తరపున ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును బరిలో దింపుతోంది. ఈ లోక్‌సభ పరిధిలో గులాబీ పార్టీకి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండటంతో పాటు నియోజకవర్గాల్లో కీలక నాయకులతో పాటు బలమైన క్యాడర్ ఉండటం ఆ పార్టీకి కలిసొచ్చే అంశంగా మారింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం రెండు సీట్లకే పరిమితమైనా ఓట్ల శాతంలో మాత్రం కాంగ్రెస్, బీజేపీ కంటే మెరుగైన స్థితిలోనే నిలిచింది. ఈ రెండు పార్టీల కంటే 16,515 ఓట్లు అధికంగా సాధించింది. ఇదే ధీమాతో ఆ పార్టీ నాయకులు ఎంపీ సీటును గెలుస్తామనే నమ్మకంతో ఉన్నారు. ఈ సీటును సాధించడం ద్వారా ఉమ్మడి జిల్లాలో మళ్లీ పట్టు నిలుపుకోవాలని ఆ పార్టీ అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ ఆయా నియోజకవర్గాల్లో కీలక నాయకులు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతుండటంతో గులాబీ పార్టీకి ప్రతికూలంగా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గత లోక్‌సభ ఎన్నికల్లో ఈ స్థానంలో తొలిసారి విజయం సాధించిన బీజేపీ సిట్టింగ్ సీటును నిలబెట్టుకోవాలని భావిస్తోంది. అభ్యర్థి విషయంలో మార్పులు చేసింది. ఆ పార్టీకి చెందిన సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావును కాదని.. బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన మాజీ ఎంపీ గోడం నగేష్‌కు టికెట్ కేటాయించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ లోక్‌సభ పరిధిలో ఏకంగా నాలుగు సీట్లు గెలుచుకుంది. నియోజకవర్గంలో నలుగురు ఎమ్మెల్యేలతో పాటు మిగితా చోట్ల పార్టీ క్యాడర్ బలంగా ఉండటంతో విజయంపై ధీమా కనబరుస్తోంది. సిట్టింగ్ సీటును నిలబెట్టుకునేందుకు ఆ పార్టీ అధిష్టానం ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలుస్తోంది. కానీ టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నించి విఫలమైన ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. దీంతో వీరు పార్టీ అభ్యర్థి విజయానికి సహకరిస్తారా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. ఈ మూడు పార్టీలు సైతం ఎవరికి వారు గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం లోక్‌సభ సమరాన్ని మరింత రసవత్తరంగా మార్చుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సుప్రీం కోర్టు సూచనలు అమలు చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాఘవులు



నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

పేదల జీవనంలో భాగమైన ఉపాధి హామీ కూలీ రేట్లను సుప్రీం కోర్టు సూచనల ప్రకారం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో సంఘం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీని ప్రభుత్వం రూ.300లకు పెంచినట్లు చెబుతోందని వాస్తవానికి ప్రతి కుటుంబానికి రోజువారీ కూలీ రూ.600లకు పెంచాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు సూచించిందని గుర్తుచేశారు. ప్రధాని మోదీ ఉపాధిహామీ వ్యతిరేక చర్యలను అవలంభిస్తున్నారని కొత్త సంస్కరణల పేరిట కూలీలపై పనిభారం పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి కనీసం 200రోజులు పని కల్పించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద ఉపాధి కూలీలకు ఏడాదికి రూ.12వేల చొప్పున చెల్లిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, జిల్లా నాయకులు కె.ఆశన్న, గంగారాం, పొచ్చక్క, ఆశన్న(చింటు) పాల్గొన్నారు.

అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్‌లో కొనసాగడం ఇష్టం లేదు

- తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రుణం తీర్చుకుంటా : పురాణం సతీష్



నవతెలంగాణ-జైపూర్

ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుల్లో ఒకరైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోటపల్లి మండలానికి చెందిన పురాణం సతీష్ తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనను తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, గడ్డం వినోద్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణతో కలిసి శనివారం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. వారం రోజుల క్రితం పురాణం సతీష్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన ఆయన అవినీతిమయమైన బీఆర్ఎస్ పార్టీలో కొనసాగడం ఇష్టం లేక బయటకొచ్చినట్టు తెలిపారు. బీఆర్ఎస్ నిరంకుశ పాలన కొనసాగించిందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో కేసులు ఎదుర్కోవడమే కాకుండా జైలు జీవితం అనుభవించినప్పటికీ బీఆర్ఎస్ పార్టీ సముచిత స్థానం కల్పించలేదని ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షునిగా ఉమ్మడి జిల్లాలో పార్టీని బలోపేతం చేయడమే కాకుండా పార్టీ కోసం అహర్నిషలు పని చేసినా గుర్తించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం బాధాకరమని, కల్వకుంట్ల కవిత లిక్కర్ స్కాం పట్ల తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను ఛీదరించుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి స్వరాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీలో చేయడం సంతోషంగా ఉందన్నారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు



కెరమెరిలో పరీక్ష రాసి బయటకొస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఈ నెల 18 నుంచి ప్రారంభమైన పరీక్షలు శనివారం చివరి పరీక్ష సాంఘిక శాస్త్రంతో పూర్తయ్యాయి. జిల్లాలో మొత్తం 53 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్ష కొనసాగింది. ఆయా కేంద్రాల్లో ఉదయం 8 గంటల 45 నిమిషాల నుంచే విద్యార్థులను అనుమతించారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం లోనికి అనుమతించారు. పరీక్ష అనంతరం విద్యార్థులు కేరింతలు కొడుతూ బయటకు వచ్చారు. చివరి రోజు 10 వేల 404 మందికి గాను 10 వేల 361 మంది హాజరై 43 మంది గైర్హాజరైనట్లు డీఈఓ ప్రణీత తెలిపారు. అదే విధంగా ఏప్రిల్ 1న వొకేషన్ పరీక్ష ఉంటుందని, దీని కోసం 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనికి జిల్లా వ్యాప్తంగా 983 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

కెరమెరి : 18 నుండి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారు. చివరి రోజు సాంఘిక పరీక్ష రాసిన విద్యార్థులు పరీక్ష కేంద్రం నుండి బయటికి వస్తూ ఆనందోత్సవాన్ని వ్యక్తం చేశారు. మోడీ బాలికల ఆశ్రమ, అనార్‌పల్లి, హట్టి ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు సొంత గ్రామాలకు తీసుకెళ్లేందుకు వసతి గృహాల వద్దకు తరలివచ్చారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తామంటూ విజయ దరహాసంతో స్వగ్రామాలకు పయనమయ్యారు.

రాజకీయాలు మాని అన్నదాతలను ఆదుకోవాలి

నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్ ప్రభుత్వ నాయకులు రాజకీయాలు మాని అన్నదాతలను ఆదుకోవాలని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి తారకరామారావు పిలుపు మేరకు పెద్దపల్లిలో పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ చేపట్టిన 36 గంటల నిరసన దీక్షకు మద్దతుగా శనివారం దీక్షలో పాల్గొన్నారు. పంటలకు నీరందక ఎండి పోతున్నందున ముందుగా పంటలకు నీళ్లు ఇవ్వాలని, ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో పాటు నియోజకవర్గం పరిధిలో గల వివిధ ఏరియాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు దీక్షలో పాల్గొన్నారు.



నేషనల్ హ్యూమన్ రైట్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్ : నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన నూతనంగా ఎన్నికైన సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. మహిళా సంరక్షణ కమిటీ ఉపాధ్యక్షురాలిగా రాధ, ఆదిలాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా గంట ప్రమోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కవిత, సహాయ కార్యదర్శిగా సునంద, సభ్యులుగా విశాల్‌సింగ్‌ను నియమించారు. అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపారు. మానవ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలన్నారు. హక్కులకు ఎవరికైన, ఎక్కడైన భంగం కలిగినట్లయితే వెంటనే తమను సంప్రదించాలని చంద్రశేఖర్ సూచించారు.

ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్

పేదింటి కష్టాలు తెలిసిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు జవ్వాద్ అన్సారీ, శేక్ నబి అన్నారు. శనివారం ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ నివాసంలో వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి, శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ నేను మీ అడబిడ్డనని కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో ఆదివాసీ అడబిడ్డకి అవకాశం ఇచ్చిందని అన్నారు. మీ కృషితోనే గెలుపు సాధ్యం అన్నారు. మీరందరూ కష్టపడి పని చేసి నన్ను ఆశీర్వదించాలని కోరారు.



ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

నవతెలంగాణ-ఉట్నూర్

పదో తరగతి పరీక్షలు శనివారం చివరి రోజు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని నాలుగు కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు 144సెక్షన్‌ల మధ్య పరీక్షలు నిర్వహించారు. చివరి రోజు పరీక్ష కావడంతో కేంద్రాల వద్ద తల్లిదండ్రులతో రద్దీగా మారింది. పది పరీక్షలు రాసిన విద్యార్థులు ఇంటర్మీడియట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని టీఎఫ్ టీఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు జాదవ్ రవీందర్ సూచించారు.



సుశీలమ్మ సేవలు అభినందనీయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

33 ఏండ్ల సర్వీస్‌లో చిన్నపాటి పొరపాట్లకు కూడా తావివ్వకుండా సుశీలమ్మ అందించిన సేవలు అభినందనీయమని డీఆర్‌డీఓ జి.సాయన్న అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తు ఉద్యోగ విరమణ పొందిన ఏర సుశీలను శనివారం ఘనంగా సన్మానించారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో డీఆర్‌డీఓ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. మిఠాయిలను తినిపించి, శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం మర్యాదపూర్వకంగా డీఆర్‌డీఓ వాహనంలో ఇంటి వద్దకు సాగనంపి విడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో మర్యాదగా వ్యవహరిస్తు ఉత్తమ సేవలందించారని కొనియాడారు. శేశ జీవితం కూడా సాఫీగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ జాదవ్ శేషారావు, ఏఓ సంజయ్ కుమార్, డీపీఎంలు గంగన్న, హేమలత, శోభారాణీ, సుగంధ, ఉద్యోగులు కిరణ్ కుమార్, ప్రకాష్, కిరణ్, సవిత, లత పాల్గొన్నారు.

అనారోగ్యంతో కోఆప్షన్ సభ్యుడి మృతి

నవతెలంగాణ-తలమడుగు



మండల కోఆప్షన్ సభ్యులు, మైనార్టీ నాయకుడు కబీరుల్లా ఖాన్ (70) తన స్వగ్రామం ఖోడద్‌లో శనివారం అనారోగ్యం మరణించినట్టు తన కుమారుడు అమానుల్లాఖాన్ తెలిపారు. గత కొద్ది నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతుండగా శనివారం మృతి చెందినట్టు తెలిపారు. మైనార్టీ నాయకుడిగా అన్ని వర్గాల ప్రజలతో కలిసిమెలసి ఉంటూ ఉండేవాడని తెలిపారు. ఆయన చేసిన సేవలను గ్రామస్తులు కొనియాడారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నటు కుటుంబ సభ్యులు తెలిపారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

నవతెలంగాణ-నార్నూర్

ఎండాకాలం నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు ఎంపీపీ కనక మోతుబాయి సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. సర్వసభ్య సమావేశానికి ఆరుగురు ఎంపీటీసీలు హాజరయ్యారు. గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అదికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ జవహర్ లాల్, ఆయా శాఖల అధికారులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రేపు తునికాకు కళ్లేదార్ల సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఎప్రిల్ 1న జరిగే తునికాకు కళ్లేదార్ల సమావేశం జయప్రదం చేయాలనీ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆత్రం తనుష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్, తునికాకు కట్ట రేటు పెంపు, ఇతర సమస్యలపై ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలోని తునికాకు కళ్లేదార్లు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామానికి చెందిన సౌకత్ భాయ్ గత మూడు రోజుల కింద అనారోగ్యంతో బాధపడుతూ మరణించాడు. శనివారం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులు అధైర్య పడొద్దని అన్నారు. ఎమ్మెల్యే వెంట మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విపత్తు నిర్వహణ పట్ల అధికారులకు అవగాహన ఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విపత్తు నిర్వహణ పట్ల జిల్లా అధికారులందరికీ పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం వేడి గాలులు ప్రకృతి విపత్తు నిర్వహణ అవగాహన కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డా.శ్రీనివాస్ పాల్గొని పీపీటీ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా, అధిక ఉష్ణోగ్రతల వల్ల తగు ఏర్పాట్ల కొరకు యాక్షన్ ప్లాన్ ఈ నెల 31లోగా సమగ్ర ప్రణాళిక రూపొందించి, ముఖ్య ప్రణాళిక అధికారికి అందజేయాలని అధికారులను ఆదేశించారు. పలు కూడళ్లలో, బస్ స్టాండ్‌లో, తదితర ప్లేస్‌లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతీ మండలాల్లో క్యాంపులు నిర్వహించి, పశువులకు మేత, తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఎండ తీవ్రత అధికంగా ఉన్న రోజుల్లో ప్రజలు ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు బయటకు రావద్దని, అత్యవసరమైతేనే తప్ప తగు జాగ్రత్తలతో బయటకు రావాలని కోరారు. అన్ని చోట్ల ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలని, ఆశావర్కర్లతో పంపిణీ చేసే విధంగా వైద్యాధికారి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ వికాస్ మహతో, సూపరింటెండెంట్ రాజేశ్వర్ సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

వందశాతం పోలింగ్ నమోదయ్యేలా అవగాహన కార్యక్రమాలు

నవతెలంగాణ-నిర్మల్

వందశాతం పోలింగ్ నమోదయ్యేలా స్వీప్ కార్యక్రమాలను విస్తృతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వీప్ కోర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ నమోదు దిశగా ఓటర్లకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గత ఎన్నికల్లో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో తగ్గిన పోలింగ్ శాతాన్ని గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో స్వీప్ నోడల్ అధికారి, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీపీఆర్వో విష్ణువర్ధన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, సభ్యులు ఆయాత్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు

- విస్తృతంగా తనిఖీలు, నగదు మద్యం స్వాధీనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు జరిగేలా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి అంశాన్ని పరిగణలోనికి తీసుకొని ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం, ప్రలోభాలను నియంత్రించడానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు నియమ నిబంధనల ననుసరించి చెక్ పోస్టుల్లో అన్ని రకాల వాహనాల తనిఖీలు నిర్వహించడం, బార్డర్ చెక్ పోస్టుల్లో తనిఖీలు పకడ్బందీగా, 24 గంటల పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ నిఘాలో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీలలో పట్టుబడిన నగదుకు రసీదులను జిల్లా గ్రీవెన్స్ కమిటీకి సంబంధిత అధికారులు అందజేస్తున్నారు.

మొత్తం రూ.5లక్షలకు పైగా నగదు సీజ్...

ఎస్ఎస్టీ టీమ్‌లు 18, ఎఫ్ఎస్టీ టీమ్‌లు 21, జిల్లాలో పని చేస్తున్నాయని, షిఫ్టుల వారిగా 24 గంటలు పనిచేస్తున్నారని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. కోడ్ ఉల్లంఘన ద్వారా మార్చి 30 వరకు ఎస్ఎస్టీ నుంచి రూ.3లక్షలు, ఎఫ్ఎస్టీ నుంచి రూ.2లక్షల73వేలు మొత్తం రూ.5లక్షల 73వేలు సీజ్ చేసినట్టు తెలిపారు. పోలీస్ శాఖ లిక్కర్ 1515.94 లీటర్లు పట్టుకున్నారని వాటి విలువ రూ.4లక్షల46వేల 912 ఉంటుందన్నారు. ఎక్సైజ్ శాఖ ద్వారా 1821.74 లీటర్లు మద్యం, వాటి విలువ రూ.7లక్షల 64వేల 190 ఉంటుదని తెలియజేశారు. మొత్తం 3337.68 లీటర్లు ఉంటుందని వాటి విలువ రూ.12లక్షల 11వేల 102 ఉంటుందని పేర్కొన్నారు.

సీవిజిల్ యాప్ ద్వారా 8 ఫిర్యాదులు...

సీ-విజిల్ యాప్ ద్వారా 8 ఫిర్యాదులు అందగా, వాటిని పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల్లో రాజకీయ నాయకుల ఖర్చు రూ.90 లక్షలకు మించరాదని రాజకీయ పార్టీల అభ్యర్థులు నిర్వహించే రోడ్‌షోలు ఫంక్షన్లలో భోజనాలు ఖర్చులను ఎఫ్ఎస్టీ టీమ్‌లు రికార్డు చేయాలన్నారు. రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ స్పీకర్ ప్రచారాలు నిలిపివేయాలని, రిటర్నింగ్ అధికారి అనుమతితో రాజకీయ పార్టీల అభ్యర్థులు ఖర్చుల వివరాలు అకౌంటింగ్ టీం అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలని పేర్కొన్నారు. సీ విజిల్ యాప్ 1950 గురించి ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.



రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దు...

సీ విజిల్ యాప్‌లో వచ్చే ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించాలని, సీజ్ చేసిన నగదు వివరాలు ఈఎస్ఎంఎస్ యాప్‌లో అప్లోడ్, కలెక్టరేట్‌లో గ్రీవిన్స్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని, దీనికి సంబంధించి జిల్లా కోఆపరేటివ్ అధికారిని సంప్రదించవచ్చని సూచించారు. చెక్ పోస్టుల్లో జరిగే తనిఖీల్లో రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లేవారు తగిన ఆధారాలు చూపించాలని ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల కోడ్‌కు లోబడి పనిచేయాలని, ఎవరైన మోడల్ కోడ్ కండక్ట్ ఉల్లంఘనలకు పాల్పడితే ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు.



లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా (ఫైల్ ఫోటో)

జిల్లాలో మట్కా నిర్మూలనే లక్ష్యం : ఎస్పీ

- మట్కా నేరస్థులపై పీడీ యాక్ట్ సిఫార్సు
- యువత ఆన్‌లైన్ గేమ్‌లకు, మట్కాకు బానిస కావొద్దు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యువత, జిల్లా ప్రజలు మట్కాపై ఆకర్షితులు కావొద్దని జిల్లా ఎస్పీ గౌస్ఆలం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా మట్కా నిర్మూలనే లక్ష్యంగా పకడ్బందీగా చర్యలను తీసుకుంటున్నట్టు తెలిపారు. శనివారం నిర్వహించిన దాడిలో జైనథ్ పోలీస్ స్టేషన్‌లో నలుగురిపై కేసు నమోదైందని వీరి వద్దనుంచి మట్కా చిట్టీలు, రూ.11వేల 200 నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలియజేశారు. భీంపూర్ పోలీస్ స్టేషన్‌లో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు వీరి వద్ద నుంచి మట్కా చిట్టీలు రూ.21వేల 700 నగదు స్వాధీనం చేసుకోబడినట్టు తెలియజేశారు. మొత్తంగా ఇరు మండలాల పీఎస్‌లలో జైనథ్‌లో 11 మందిపై కేసులు నమోదయ్యాయని, 9 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి మట్కా చిట్టీలు రూ.32వేల 750 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కాగా ఈ సంవత్సరం 12 కేసులలో 41 వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి దాదాపు రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలియజేశారు. అత్యాశకు పోయి డబ్బులను పోగొట్టుకోవద్దని యువతకు ప్రజలకు తెలియజేశారు. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లా మహారాష్ట్రకు ఆనుకొని ఉన్నందున బార్డర్ కి అవతల వైపు ఉన్న నేరస్తులు జిల్లాలో తరచూ మట్కా నిర్వహించే ప్రయత్నం చేస్తున్నారని, వారిని అడ్డుకోవడంలో జిల్లా పోలీసు వ్యవస్థ ముందుందని తెలియజేశారు. గత సంవత్సరం 43 కేసులను నమోదు చేసి 116 వ్యక్తుల అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.6లక్షల 54వేల 660 నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలియజేశారు. మట్కా నిర్వహిస్తున్న నిందితులను బైండోవర్ చేస్తూ అడ్డుకట్ట వేస్తున్నామని తెలియజేశారు. అదేవిధంగా తరచు మట్కా నిర్వహిస్తున్న నిందితులనుపై పీడీ యాక్ట్ సిఫార్సు చేయబోతున్నట్లు తెలియజేశారు. తల్లిదండ్రులు పిల్లల దిన చర్యపై ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని అన్నారు. పిల్లలు ఆన్‌లైన్ మట్కా, బానిస కాకుండా పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ, ఎస్సైలు ఉన్నారు.

స్వీప్ ఆధ్వర్యంలో ఓటుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

- కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికలలో యువత వందశాతం ఓటు నమోదు చేసుకొని, ఓటు హక్కును వినియోగించుకునేలా కమిటీ సభ్యులు స్వీప్ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్వీప్ కమిటీ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలో స్వీప్ కార్యాచరణ పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఓటు హక్కుపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, ఓటు ప్రాముఖ్యత తెలిసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టి చైతన్యం తేవాలని అన్నారు. యువత వంద శాతం ఓటు నమోదు చేసేలా స్వీప్ ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థి ఓటరుగా నమోదు చేయాలనీ అన్నారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లి తప్పనిసరిగా ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం చేసేలా ప్రభుత్వం, ప్రయివేట్ కాలేజీలకు క్యాంపస్ అంబాసిడర్లను నియమించాలని అన్నారు. డబ్బు, మద్యం, బహుమతుల ఎన్నికల వేళ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిష్పక్షపాతంగా అభ్యర్థులను ఎన్నుకున్నట్లైతే తిరిగి వారి నుంచి మనం మంచిని ఆశించవచ్చన్న విషయాన్ని యువ ఓటర్లకు తెలియజేయడం కనీస భాధ్యతని అన్నారు. మేరా పహ్లా వోట్ దేశ్ కీలియే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, కళాశాలలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా చూడాలన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందేలా, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చైతన్యం కల్పించాలని అన్నారు. ప్రతి నియోజక పరిధిలో స్వీప్ ప్రోగ్రాం బృందాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో, పట్టణ ప్రాంతాలలో ఓటింగ్ శాతం పెరిగేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రతి కూడలి వద్ద ఓటు హక్కు గురించి ప్రజలకు తెలిసేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఓటు హక్కు దేశంలోని ప్రతి ఒక్కరికి సమానమని అందరికి సమాన స్వేచ్ఛ, హక్కులు రాజ్యాంగంలో పొందు పరిచారని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ వికాస్ మహతో, స్వీప్ కమిటి సభ్యులు ఉన్నారు.

ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కలిసికట్టుగా కృషి చేస్తామని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఏఐసీసీ ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థిగా సుగుణ పేరును ఖరారు చేసిన సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఉట్నూర్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి, సీఎం రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దుర్గం రాజేశ్వర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.దామోదర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, నాగరాజు, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉపాధ్యాయు ఉద్యోగం సంతృప్తినిచ్చింది



నవతెలంగాణ-జైనథ్

ఉపాధ్యాయు ఉద్యోగం తనకు సంతృప్తినిచ్చిందని, ఉపాధ్యాయుడు గుంటుక నాందేవ్ అన్నారు. శనివారం మండలంలోని కాన్పమేడిగూడ(ఆర్) జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా గ్రామస్తులు, విద్యార్థులు ఉపాధ్యాయుడు గుంటుక నాందేవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏ ఉద్యోగికైనా ఉద్యోగ విరమణ అనేది సహజమని అన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగం సంతృప్తినిచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యవాన్ చిక్టే, ఎంఈఓ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మణ సంఘ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పట్టణంలో నిర్మించిన గాయిత్రి బ్రాహ్మణ సంఘ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను బ్రాహ్మణ సంఘ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం, వైస్ ప్రసిడెంట్ కావలి సంతోష్, మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దయానంద్, సీనియర్ న్యాయవాది, కృష్ణారావు, నాయకులు, బ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్ ర్యాలీ

నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని అంబేద్కర్‌చౌక్ నుంచి అంగడి బజార్, తదితర కాలనీల్లో క్రిష్టియన్ మిషనరీ అధ్యక్షులు డానియాల్ పాస్టర్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీని నిర్వహించారు. శనివారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా ర్యాలీలు తీస్తున్నామని అన్నారు. ర్యాలీలో ఏసుక్రీస్తు పాటలు పాడుతూ ప్రజలకు శాంతి సందేశాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ప్రధాన కార్యదర్శి జోసెఫ్ పాస్టర్, బి.కుమార్, ఘాజీ మహ్మద్, రాజరత్నం, శామ్యూల్, జీవరత్నం, క్రిష్టియన్‌లు పాల్గొన్నారు.

అటవీశాఖ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు

నవతెలంగాణ-కడెం

కవ్వాల్ పులుల రక్షిత ప్రాంతంలోని అటవీ అధికారులు, సిబ్బందికి అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామని కడెం ఎఫ్ఆర్ఓ అనిత తెలిపారు. శనివారం ఉదయం మండల కేంద్రంలోని అటవీ రేంజ్ కార్యాలయంలో మండలంలోని అటవీ అధికారులకు, సిబ్బందికి ఉచితంగా రక్త పరీక్షలు, బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడారు అటవీ అధికారులు, సిబ్బందికి ఆరోగ్య రీత్యా ఎటువంటి సమస్యలు ఉండకుండా ఉండేందుకు ముందస్తుగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓలు సిద్ధార్థ, ప్రకాష్ అటవీ అధికారులు, సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏప్రిల్ 6న నర్సరీ పండ్ల తోటల వేలం

నవతెలంగాణ-ఉట్నూర్

ఏప్రిల్ 6న ఉట్నూర్ ఐటీడీఏ ఉద్యాన నర్సరీలోని మామిడి, జామ తోటలను వేలాన్ని వేయనున్నట్టు ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేలాన్ని ఉట్నూర్ ఐటీడీఏ ఉద్యావన నర్సరీలో ఏప్రిల్ 6 శనివారం మధ్యాహ్నం 3గంటలకు వేలం ఉంటుదని, ఆసక్తి గల వ్యాపారస్తులు, సంస్థలు వేలం పాటలో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాలకు ఉట్నూర్ ఐటీడీఏలోని ప్రాజెక్ట్ హార్టికల్చర్ ఆఫీసర్, ఐటీడీఏ ఉద్యాన అధికారి సుధీర్ కుమార్ నెంబర్‌ను 9032313933 సంప్రదించాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలన్నారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సీవిజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, ట్రైనీ కలెక్టర్ వికాస్ మహతో, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విధి నిర్వాహణలో విశిష్ట సేవలు అభినందనీయం

నవతెలంగాణ-నిర్మల్

ఉద్యోగ విధి నిర్వాహణలో జిల్లా ఖజాన శాఖ అధికారి పి.ప్రభాకర్‌రావు, కలెక్టరేట్ జి-సెక్షన్ సూపరింటెండెంట్‌గా పని చేసిన పరిమల్ బౌమిక్ వారి విశిష్ట సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శనివారం పదవీ విరమణ పొందిన సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా వారిని శాలువాతో సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించి పలువురి మన్ననలు పొందిన అధికారులు ఆదర్శప్రాయులని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది, ట్రెజరీ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రేఖశ్యామ్ నాయక్‌ను కలిసిన ఆత్రం సుగుణ

నవతెలంగాణ-ఉట్నూర్

మాజీ ఎమ్మెల్యే రేఖశ్యామ్ నాయక్‌ను ఖానాపూర్‌లోని ఆమె నివాసంలో శనివారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ సత్తు మల్లేష్‌తో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఆత్రం సుగుణ మాట్లాడుతూ నాపై నమ్మకంతో కాంగ్రెస్ అధిష్టానం అవకాశాన్ని కల్పించిందని, తన గెలుపునకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నవతెలంగాణ-వాంకిడి



మండల కేంద్రంలో నితిన్ స్మారక నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో జెడ్పీటీసీ అజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం, స్నేహభావం ఏర్పడుతుందని, యువత క్రీడలతో పాటు చదువులో కూడా ముందుండాలన్నారు. టోర్నమెంట్ చివరి మ్యాచ్‌లో విజేతగా నిలిచిన డెయిలీ క్రికెట్ జట్టుకు రూ.20 వేలతో పాటు ట్రోఫీ అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన నాని సెలక్షన్ జట్టుకు రూ.10 వేలతో పాటు ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో మౌల్కార్ అరుణ్, మౌల్కార్ అశోక్, ఐటీడీఏ డైరెక్టర్ భీంరావు, మాజీ సర్పంచ్ గంగారాం, క్రీడాకారులు పాల్గొన్నారు.

వీరభద్ర కాలనీలో కార్డన్‌సెర్చ్

నవతెలంగాణ-కౌటాల



మండల కేంద్రంలోని వీరభద్ర కాలనీలో సీఐ సాదిక్‌పాషా ఆధ్వర్యంలో శనివారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం కాలనీ వాసులకు నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 20 మోటార్ సైకిళ్లను ఆధీనంలోకి తీసుకున్నారు. కాలనీల్లో ఎవరైన అపరిచిత వ్యక్తులు కలిసిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇలాంటి కార్డన్ సెర్చ్‌ల వల్ల నేరాలు నియంత్రణలో ఉంటాయన్నారు. ఈ కార్డన్‌సెర్చ్‌లో సీఆర్‌పీఎఫ్ బలగాలు, కౌటాల, చింతలమానపెల్లి ఎస్‌ఐలు మధూకర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు



నవతెలంగాణ-వాంకిడి

మండలంలో నిర్వహించిన పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిసినట్టు ఎంఈఓ మనుకుమార్ తెలిపారు. పదో తరగతి పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆయన విద్యార్థులను కోరారు. పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

పెంచికల్‌పేట్ : పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 143 మంది విద్యార్థులకు గాను 143 మంది హాజరైనట్టు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్ తెలిపారు. పరీక్ష కేంద్రంలో ఏడు రోజులకు ఏడు రోజులు నీటిని విద్యార్థులకు సామాజిక కార్యకర్త తిరుపతి అందించారు. మాజీ జాగృతి అధ్యక్షుడు నగునూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు పరీక్ష అనంతరం పండ్లు, శీతల పానియాలను అందించారు.

ఏప్రిల్ 2న జిల్లా విస్తృతస్థాయి సమావేశం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన ఆశ్రమ పాఠశాలలు ప్రభుత్వ హాస్టళ్లలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ డైలీ వైజ్ కార్మికుల జిల్లా సమావేశం ఏప్రిల్ 2న జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టేకం ప్రభాకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల బాగోలు చూస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడం దారుణం అన్నారు. 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న గుర్తింపు లేకపోవడం బాధాకరమన్నారు. కార్మికులు ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల ఐక్యతను చాటే ఉద్దేశంతో ఏప్రిల్ 2న జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు అరిగెల కోటయ్య, జిల్లా గౌరవ అధ్యక్షులు వెలిశాల క్రిష్ణమాచారి, వర్కర్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పౌరులు చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ద్వారా శాంతియుత జీవనానికి తోడ్పాటునందిస్తుందని కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు అన్నారు. శనివారం మండలంలోని ఉట్పల్లి గిరిజన గ్రామంలో రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, వాహన నియమాలు, ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, విద్యాబుద్ధులతో సన్మార్గంలో నడవాలన్నారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక శక్తులకు సహకరించవద్దని, సమస్యలుంటే నేరుగా పోలీస్ స్టేషన్‌లో నిర్భయంగా కలవచ్చని భరోసా ఇచ్చారు. అనంతరం నిరుపేదలకు 150 కిలోల బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా, పోలీసులు పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహించి ఖాళీలు భర్తీ చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి రీజియన్‌లో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్లకు పరీక్షలు నిర్వహించి వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి అన్నారు. శనివారం ఖైరిగూడ ఓసీపీ ఈపీ ఆపరేటర్లు ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి రీజియన్‌లో 2022-23కు సంబంధించిన ఈపీ ఆపరేటర్లకు పదోన్నతుల్లో ఈ-గ్రేడ్ నుండి టీ-గ్రేడ్‌కు, సీ-గ్రేడ్ నుండి బీ-గ్రేడ్ బీ-గ్రేడ్ నుండి ఏ-గ్రేడ్‌కు కేటగిరీల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రామగుండం, కొత్తగూడెం రీజియన్‌లో పదోన్నతులను భర్తీ చేసేందుకు యాజమాన్యం పరీక్షలు నిర్వహించి పూర్తి చేసిందని గుర్తు చేశారు. ఇవి రెగ్యూలర్ నిర్వహించే వీటికి, ఎన్నికల కోడ్‌కు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జూపాక రాజేష్, కె.కిరణ్‌బాబు, దివాకర్, ఈపీ ఆపరేటర్లు గణేష్, మోహన్‌రావు, తిరుపతి, సంతోష్, రారాజు, రవి, బాబా, ఎండీ హజాం పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రైలు నుండి పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ రైల్వేస్టేషన్ చివర బల్లార్షా వైపు జార్ఖండ్ రాష్ట్రం దార్వా జిల్లాకు చెందిన దిలీప్ కుమార్(22) గుర్తు తెలియని రైలు ఢీ కొని మృతిచెందినట్టు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... దిలీప్‌కుమార్ వద్ద ఉన్న గుర్తింపు కార్డు ఆధారంగా హైదరాబాద్‌లో సెంట్రింగ్ మేస్త్రీ వద్ద కూలీ పనిచేయడానికి బిలాస్‌పూర్ రైల్వేస్టేషన్ నుండి సికింద్రాబాద్ వెళ్లడానికి గుర్తు తెలియని రైలు ఎక్కి ప్రయాణిస్తుండగా మార్గమధ్యలో సిర్పూర్ రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు నుండి కిందపడి మరణించినట్టు పేర్కొన్నారు. మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించామని వారు వచ్చేంత వరకు సిర్పూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచినట్టు తెలిపారు.

ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం



అవిశ్వాస తీర్మానికి మద్దతు తెలుపుతున్న ఎంపీటీసీలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

కొన్ని రోజుల నుండి సిర్పూర్ ఎంపీపీ చునార్కర్ సువర్ణపై అవిశ్వాస తీర్మాణానికి శనివారం తెరపడింది. ఎంపీపీ తమను పట్టించుకోవడం లేదని ఆరుగురు ఎంపీటీసీలు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను తనను ఆహ్వానించడంలేదని, నిధులు కూడా దుర్వినియోగం చేస్తుందని, నాలుగేండ్ల పాలనలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని, సంక్షేమ పథకాలను పేదలకు అందించడంలేదని ఆరోపిస్తూ ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు గత నెలలో ఆర్డీఓ సురేష్‌కు నోటీసులిచ్చారు. గత నెల 27న సమావేశం నిర్వహించుకోవాలని, అవిశ్వాసంకు ఫిర్యాదు చేసిన ఆరుగురు ఎంపీటీసీలకు తెలిపారు. దీంతో సదరు ఎంపీపీ అవిశ్వాస తీర్మానాన్ని వాయిదా వేయాలని ఎంపీపీ హైకోర్టును ఆశ్రయించి మధ్యంతర ఉత్తర్వుల స్టే తెచ్చుకున్నారు. దీంతో ఎంపీటీసీల వాదనను హైకోర్టు పరిగణలోకి తీసుకొని 30న బేంచి న్యాయమూర్తి కాగజ్‌నగర్ ఆర్డీఓ సురేష్‌కు తిరిగి అవిశ్వాస తీర్మానాన్ని ఏప్రిల్ రెండో తేదీలోపు సమావేశం నిర్వహించుకోవాలనే ఆదేశాల మేరకు శనివారం అవిశ్వాస తీర్మానం ఏర్పాటుచేశారు. శనివారం హైకోర్టు న్యాయమూర్తి ఆదేశాల ప్రకారం అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించగా ఏడుగురు ఎంపీటీసీలు ఎంపీపీ చునార్కర్ సువర్ణపై అవిశ్వాసంపై మద్దతు తెలిపారు. ఈ విషయంపై ఆర్డీఓ సురేష్ విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీపై ప్రవేశపెట్టి అవిశ్వాసం నెగ్గిందని, తదుపరి నిర్ణయం కోసం కలెక్టర్‌కు నివేదికలు పంపించి ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎంపీపీ ఎన్నిక ఉంటుందన్నారు.



అవిశ్వాసం నెగ్గడంతో విజయ సంకేతం

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా పౌరసరఫరాల శాఖ, జిల్లా పౌర సరఫరాల సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 2023-24 వరి ధాన్యం కొనుగోలుపై వ్యవసాయ, సహకార, ఐకేపీ, కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, రైస్ మిల్లర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని, ఇందులో భాగంగా ఏప్రిల్ 1న వరి సాగు చేసిన మండలాలలో మండలానికి 1 చొప్పున వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. అనంతరం వరి కోతలు ప్రారంభమయ్యేలోగా మిగతా కేంద్రాలు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో 37 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వేసవి కాలం దృష్ట్యా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, నీడ సౌకర్యాల కల్పనతో పాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. వరి ధాన్యం కొనుగోలుకు అవసరమైన గన్ని సంచులను సమకూర్చడంతో పాటు టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. గ్రేడ్-ఏ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో నిబంధనల ప్రకారం తప్ప, తాలు, మట్టి గడ్డలు, తేమ శాతం ఇతరత్రా అంశాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ధాన్యం తూకం జరిగిన వెంటనే రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున జాగ్రత్తగా వ్యవహరించాలని, ఇతర ప్రాంతాల నుండి జిల్లాకు ధాన్యం రాకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ధాన్యం రవాణా సమయంలో ఎగుమతి, దిగుమతులకు అవసరమైన హమాలీలను అందుబాటులో ఉంచాలని, తరలింపు ప్రక్రియ వేగవంతంగా జరిగేలా అధికారులు, రైస్ మిల్లుల యజమానులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తారామణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ రావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ నరసింహారావు, తహసిల్దార్లు, వ్యవసాయ, విస్తరణ, సహకార శాఖల అధికారులు, ఐకేపీ అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ధోత్రే వెంకటేష్

ప్రతి కార్మికుడికి స్వీట్ బాక్సులు అందించాలి

- టీబీజీకేయస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు



పర్సనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్రాజ్ శ్రీనివాస్‌రావు

నవతెలంగాణ-రెబ్బెన

2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తి లక్ష్యం సాధించినందుకు ప్రతి కార్మికుడికి, అధికారులకు కాంట్రాక్టు కార్మికులందరికి కూడా గత సంవత్సరంలో ఇచ్చిన విధంగా స్వీట్ బాక్సులు అందజేయాలని టీబీజీకేయస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్ జీఎం కార్యాలయంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తి లక్ష్యం సాధించినందుకు ప్రతి కార్మికుడికి స్వీట్ బాక్సులు అందజేయాలన్నారు. ఉత్పత్తి లక్ష్యసాధనలో అధికారులు, ప్రతి కార్మికుడి కృషి ఎంతో ఉందన్నారు. ప్రతి కార్మికుడు ఉత్సాహంతో అనుకున్న లక్ష్యం కంటే ఉత్పత్తి సాధించినందుకు ప్రతి కార్మికుడికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి సంవత్సరం ఇలాగే బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తిలో ముందంజలో ఉంచడానికి ప్రతి కార్మికుడు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ నాయకులు దరావత్ మంగీలాల్, ఏరియా కమిటీ నాయకులు గజ్జెల్లి చంద్రశేఖర్, మారిన వెంకటేశ్, అలవేని సంపత్, రాజేశం, సుగ్రీవులు, జీఎం కార్యాలయం అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి మంకయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

లోక్‌సభ ఎన్నికలల్లో అర్హత గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు స్వీప్ ఆక్టివిటీస్‌లో భాగంగా చేపట్టిన 5కె రన్ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఈ హక్కును సక్రమంగా వినియోగించుకుని అభివృద్ధికి పాటుపడే నాయకత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. ఎన్నికలలో వయస్సు అర్హత, ఓటరు జాబితాలో పేరు గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. పోలింగ్ శాతాన్ని పెంపొందించే విధంగా కళాజాత ప్రదర్శన, ఇంటింటి ప్రచారం, వివిధ రకాల విస్తృత ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపర్చడం జరుగుతుందన్నారు. బూత్ స్థాయి అధికారులు వారి పరిధిలో సిబ్బందితో కలిసి అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు వేసేలా ప్రోత్సహించాలన్నారు. మే 13న జరుగనున్న పోలింగ్‌లో ఓటరు జాబితాలో పేరు గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో స్వీప్‌లో భాగంగా ఓటు వినియోగం, ప్రాముఖ్యత తెలియజేసేందుకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ 15వ తేదీలోగా నూతన ఓటర్లు తమ వివరాలు నమోదు చేసుకొని కార్డు పొందాలన్నారు. జిల్లాలో దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్లను ఓటు వేసేలా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికలలో ఎలాంటి కుల, మత, వర్గ, ప్రాంతాల వివక్ష లేకుండా, ప్రలోభాలకు గురి కాకుండా పోలింగ్ రోజు నిష్పక్షపాతంగా, నిర్భయంగా ఓటు వేయాలన్నారు. విద్యార్థులు విద్యలో రాణించడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ప్రతిరోజు వ్యాయామం చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే టోల్ ఫ్రీ నం.1950, సి-విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, జిల్లా అధికారులు, యువతీ, యువకులు, విద్యార్థినీ, విద్యార్థులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.



జెండా ఊపి రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



రన్‌లో పాల్గొన్న క్రీడాకారులు, అధికారులతో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

ఎన్నికల నియమావళి పాటించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

లోక్‌సభ-2024 ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అదనపు కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలు-2024లో భాగంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేయాలన్నారు. ఏప్రిల్ 18న గెజిట్ నోటిఫికేషన్ విడుదల అవుతుందని, 25వ తేదీ వరకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయవచ్చని, 26న నామినేషన్ల పరిశీలన, 29 వరకు నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చని తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. జూన్ 6న ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు. అప్పటివరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, పోలింగ్ కేంద్రాలలో అవసరమైన పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమర్థవంతమైన ఎన్నికల నిర్వహణ కొరకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, కాగజ్ నగర్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారులు కాసబోయిన సురేష్, లోకేశ్వర్ రావు లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ లోక్ సభ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలో సిర్పూర్, ఆసిఫాబాద్ శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలు నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ జారీకు సిబ్బంది వివరాలు సేకరించామని, ఈ వివరాలను ఎన్ఐసీ పోర్టల్‌లో నమోదు చేశామన్నారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు, ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సి-విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని, ప్రజల సౌకర్యార్థం పోలింగ్ కేంద్రాలలో అన్ని రకాల సదుపాయాలు కల్పించడంతోపాటు అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, తహసీల్దారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ పాఠశాలకు జలశుద్ధి పరికరం



నవతెలంగాణ -వాంకిడి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు ప్రముఖ స్వీట్ కంపెనీ ప్రభాస్ అగ్రి బయోటెక్ కార్పొరేట్ ఆధ్వర్యంలో జలశుద్ధి పరికరాన్ని కంపెనీ సేల్స్ అధికారి డి అశోక్‌రెడ్డి శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించేందుకు దాత ముందుకు రావడంపై పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త గాదె శివకుమార్, లక్ష్మీనారాయణ, శ్రావన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యవర్గ సమావేశం



నవతెలంగాణ-రెబ్బెన

బీజేపీ మండల అధ్యక్షుడు గోలెం తిరుపతి ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కుమురం భీం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, ఆదిలాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గోలెం నాగేష్ పాల్గొన్నారు. కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రాబోయే ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతి ఒక కార్యకర్త సైనికుల్ల పని చేయాలన్నారు. నరేంద్ర మోడీని మూడోసారి ప్రధానమంత్రిని చేయాలని, దీనికోసం ప్రతి కార్యకర్త కష్టపడి బీజేపీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, పార్లమెంట్ కోకన్వీనర్ కొలిపాక కిరణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, విశాల్ కాంద్రె, సునీల్ చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, జిల్లా సెక్రటరీ కుందారపు బాలకృష్ణ, తాలుకా కన్వీనర్ సొల్లు లక్ష్మి, కోకన్వీనర్ రమేష్, గౌడ సీనియర్ నాయకులు సతీష్‌బాబు, రాజు అగర్వాల్, మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్, మల్రాజ్ రాంబాబు, మండల బీసీ మోర్చా అధ్యక్షుడు ఉప్పరి మల్లేష్, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నంద కిశోర్ పాల్గొన్నారు.

పీజీలో ప్రవేశాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-రెబ్బెన

కాకతీయ యూనివర్సిటీ దూర విద్య కేంద్రంలో ఓపెన్ డిగ్రీ, పీజీ అన్ని గ్రూప్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం ఏ జాకిర్ ఉస్మాని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

ఆదివారం | మార్చి 31, 2024 | www.navatelangana.com

చెక్ పోస్ట్ వద్ద రూ.6.93 లక్షలు సీజ్

నవతెలంగాణ-కాసిపేట



కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం చొప్పరిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వద్ద ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎటువంటి ఆధారాలు లేకుండా వరంగల్‌కు చెందిన గంట మహేశ్ వద్ద రూ.1,20,700, జరుపుల అమ్రు వద్ద రూ.2,75,000, దండేపల్లికి చెందిన మడిపల్లి వెంకటేశ్ వద్ద రూ.2,97,500, మొత్తం రూ.6,93,200 లక్షలను పోలీసులు సీజ్ చేశారు. సీజ్ చేసిన నగదును తదుపరి చర్యల నిమిత్తం ఎస్ఎస్టీ టీంకు అప్పగించినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-మందమర్రి



పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకంలో భాగంగా మందమర్రి ఆదర్శ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన జీసీఈసీ(గర్ల్ చైల్డ్ ఎంపవర్మెంట్ క్లబ్) ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళ్యాణిఖని ఎస్‌బీఐ మేనేజర్ అబ్దుల్ మాలిక్ బ్యాంకు లావాదేవీలు, ఖాతాల నిర్వహణపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జీసీఈసీ ఇన్‌చార్జి సుష్మా మాధురి, పాఠశాల ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బొలేరోను పల్సర్ బైక్ ఢీకొని ఇద్దరి దుర్మరణం





నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రానికి సమీపంలో బులేరో వాహనం పల్సర్ బైకు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరిని ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందినట్లు జన్నారం ఎస్ఐ సర్కార్ తెలిపారు. శనివారం మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన దేవి సుదర్శన్(45) క్కడికక్కడే మరణించగా అతని అన్న కొడుకు దేవి రక్షిత్(22) తీవ్ర గాయాలు కాగా అతని స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యంలో మృతి చెందాడు. మండల కేంద్రానికి సమీపంలో అటవీ శాఖ ఈసీ సెంటర్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. జన్నారం వైపు నుంచి లక్షెట్టిపేట వైపుకు వెళుతున్న బులోరా వాహనానికి లింగాపూర్ నుంచి జన్నారం వైపు వస్తున్న పల్సర్ ద్విచక్ర వాహనం అతివేగంగా ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా రన్ ఫర్ జీసస్

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని క్రైస్తవ సంఘ పెద్దలు విశ్వాసులు అందరూ కలిసి యేసు కొరకు పరుగు అనే కార్యక్రమాన్ని శనివారం చెపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే దినం రోజున యేసుక్రీస్తు ప్రభువు సమస్త మానవాళి ప్రజల రక్షణ కోసం మరణించాడు అని, మూడవ దినం ఈస్టర్ సందర్భంగా యేసుక్రీస్తు దేవుడు తిరిగి లేచాడు అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొగ్రాం కన్వీనర్ పాస్టర్ శాలేము, పాస్టర్ అభిషేక్, పాస్టర్ జాన్, పాస్టర్ జీవన్ ప్రకాష్, పాస్టర్స్ సంఘ పెద్దలు, యువకులు మహిళలు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : పట్టణంలో సిఎస్ఐ చర్చి ప్రెస్బిటర్ ఇన్‌చార్జి రెవ ఎస్.డేవిడ్ పాల్ ఆధ్వర్యంలో ఘనంగా రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ ర్యాలీ బేతేలు దర్శన ప్రార్థన మందిరం నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా పాత బస్టాండ్ నుంచి సీఎస్ఐ చర్చి వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో బేతేలు ప్రార్థన మందిరం పాస్టర్ రత్నయ్య, సీఎస్ఐ చర్చి కమిటీ సభ్యులు నక్క, జాకోబ్, బంటు పవన్, మామిడి ప్రసాద్, యూత్ సెక్రటరీ కావ్య, వివిధ చర్చల సంఘాల పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

జేబీఎస్‌డీ నియోజకవర్గం అధ్యక్షులుగా ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ మండలం గంగిపల్లి గ్రామానికి చెందిన శీలం వెంకటేశం జై భీమ్ సైనిక్ దళ్ (జేబీఎస్‌డీ) చెన్నూర్ నియోజకవర్గం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సంధర్భంగా జేబీఎస్‌డీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఎర్రోల్ల నరేష్ శనివారం నియామక పత్రం అందజేశారు. జేబీఎస్‌డీ వ్యవస్థాపక అధ్యక్షులు అద్దంకి దయాకర్, రాష్ట్ర కన్వీనర్ ఆసాది పురుషోత్తం నేతృత్వంలో జిల్లా అధ్యక్షులతో కలిసి జేబీఎస్‌డీ అభివృద్ధికి పాటుపడుతానని ఈ సంధర్భంగా శీలం వెంకటేశం తెలిపారు.

అండర్ బ్రిడ్జి నిర్మాణ స్థల పరిశీలన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణం సంజీవయ్యకాలనీ వద్ద నిర్మాణం చేపట్టనున్న అండర్ రైల్వే బ్రిడ్జి స్థలాన్ని శనివారం ఎమ్మెల్యే హరీష్‌బాబు పరిశీలించారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు కాగా ఇటీవలే అధికారులు సర్వే చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణాన్ని స్థానిక కాలనీవాసులకు ఎలాంటి నష్టం జరగకుండా చూసే విధంగా ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పట్టణవాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన వివరించారు. స్థలాన్ని పరిశీలించిన వారిలో కౌన్సిలర్ ఎల్లేష్, నాయకులు జాకీర్, దెబ్బటి శ్రీనివాస్ ఉన్నారు.

అడవిలో అగ్గి ఆర్పడం బాధ్యతగా తీసుకోవాలి

నవతెలంగాణ-కాసిపేట

అటవీలో అగ్గి పడితే బాధ్యతగా అర్పాలని డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ పేర్కొన్నారు. శనివారం ముత్యంపల్లి ఫారెస్ట్ సెక్షన్ పరిధిలోని కొండాపూర్, మల్కేపల్లిలో ఉపాధి హామీ పథకంలో భాగంగా అటవీ ప్రాంతంలో కందకాలు తవ్వడానికి వచ్చే ఉపాధి హామీ కార్మికులకు అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సంధర్భంగా డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ కార్మికులు తమ వెంట అగ్గి పెట్టెలు కాని, బీడీలు కాని కాల్చరాదని, అలాగే ఇప్ప పువ్వ సేకరణ చేసే వారు ఇప్ప చెట్టు కింద అగ్గి పెట్టరాదని సూచించారు. అగ్గి పెట్టడం వల్ల అటవీ ప్రాంతంలో అగ్గి రాజుకొని అటవీలోని వన్యప్రాణులు, చెట్లు, మొక్కలు కాలిపోయి అంతరించి పోయే ప్రమాదం ఉందని వివరించారు. ఒక వేళ కార్మికులు ఉన్న సమయంలో అగ్గి పడినట్టైతే కలిసి గట్టుగా అగ్గి ఆర్పేయాలని, ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. నిబంధనలు పాటించకుంటే అటవీ ప్రాంతంలో ఉపాధి పని ఆపివేయడం జరుగుతుందన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ రమణాదేవి(47) శనివారం మృతి చెందింది. బాలాజీనగర్ సెక్టార్ పరిధిలోని కుసుమమందిర్ అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్‌గా పని చేసే రమణాదేవి ఇటీవలే అనారోగ్యానికి గురైంది. కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు తీసుకువెళ్లి చికిత్సలు చేయించగా, శనివారం మృతి చెందింది. మృతురాలికి భర్తతో పాటు పాప, బాబు ఉన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన ఉండాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్లు బి.రాహుల్, సబావత్ మోతిలాల్, ఆర్‌డీఓ వి.రాములు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ డి.చంద్రకళతో కలిసి సహాయ రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఏఎల్ఎంలు, ఐటీ. సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు హ్యాండ్‌బుక్‌పై పూర్తి అవగాహన కల్పించాలని, ఎన్నికల నిర్వహణ, పోలింగ్, కౌంటింగ్ కార్యక్రమాలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. పోలింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, పోలింగ్ రోజు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల విషయంలో ఇబ్బంది తలెత్తినట్లయితే వెంటనే చర్యలు తీసుకోవాలని, ఫారం-12డి, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లా మొత్తంగా 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ రోజున ముందు మాక్ పోలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు ఎలాంటి అలసత్వం లేకుండా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, శిక్షణ సక్రమంగా అందించినప్పుడే ఎన్నికల ప్రక్రియ సక్రమంగా జరుగుతుందని తెలిపారు. అనంతరం బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల పనితీరుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్

నేరస్థులకు శిక్ష పడేలా కన్వెన్షన్ రేట్ పెంచాలి

● బాధితుల పిర్యాదు పట్ల వెంటనే స్పందించాలి

● పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో చార్జ్‌షీట్ వెంటనే వేయాలి

● రామగుండం సిపి శ్రీనివాస్





నవతెలంగాణ-జైపూర్

సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పరిశోధనతో సమగ్ర విచారణ చేపట్టి నేరాల నియంత్రణ చేసి చట్టపరంగా సమగ్ర సాక్ష్యాదారాలతో నేరస్థులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ సూచించారు. శనివారం రామగుండం పోలీస్ కమీషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధి డీసీపీలు, ఏసీపీలు, సీఐ, పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలతో యూఐ కేసులు, గ్రేవ్ యూఐ లాంగ్ పెండింగ్, వివిధ రకాల కేసుల పరిష్కారానికి పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలన్నారు. పోక్స్, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరిగగతిన ఇన్వెస్టిగేషన్ 60 రోజులలో పూర్తి చేసి కోర్ట్ చార్జీషీట్ వేయాలని సూచించారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండటంతో పాటు పూర్తి పారదర్శకంగా కేసును ఇన్విస్టిగేషన్ చేయలన్నారు. బాధితుల పిర్యాదులకు, ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. ఓల్డ్ పెండింగ్ ఉన్న కేసులలో ఇన్విస్టిగేషన్ త్వరగా పూర్తి చేసి డిస్పోజల్ చేయాలని లాంగ్ పెండింగ్ ఉన్న కేసులను రివ్యూ నిర్వహించి సంబంధిత అధికారులకు తగు సూచనలు, సలహాలు చేశారు. ప్రతి సీడీపై లోప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని తెలిపారు. పెండింగ్ ఉన్న నాన్ బెయిలేబుల్ వారెంట్స్ వెంటనే ఎగ్జిక్యూట్ చేయాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల నిర్వాహణలో సమిష్టిగా కృషి చేసి సజావుగా సాగేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకున్న ఆర్కే-న్యూటెక్ గని



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-న్యూటెక్ గని 2023-24 వార్షిక నిర్దేశిత లక్ష్యం 1,60,000 టన్నులను శుక్రవారం రాత్రి బదిలీతో పూర్తి చేసుకొంది. ఈ సందర్భంగా శనివారం ఉదయం ఆర్కే-న్యూటెక్ గని వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని గని ఉద్యోగులను అభినందించారు. అనంతరం ఉద్యోగులకు స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఆర్కే-న్యూటెక్ గని వంద శాతం ఉత్పత్తి సాధించడం హర్షణీయమని పేర్కొన్నారు. గనిలో ఎలాంటి ప్రమాదాలు లేకుండా వార్షిక లక్ష్యాన్ని చేరుకోవడం శుభపరిణామన్నారు. గనిలోని అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు, నాయకుల కృషి ఫలితంగానే ఇది సాధ్యమైందన్నారు. రాబోవు రోజుల్లో ఉద్యోగులు ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఆదర్శంగా నిలువాలని సూచించారు. పని స్థలాల్లో రక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ప్రమాదరహిత ఉత్పత్తికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. గైర్హాజరు లేకుండా ఉద్యోగులందరూ తప్పకుండా విధులకు హాజరు కావాలని తెలిపారు. సంపాదిస్తున్న మొత్తాన్ని వృథాగా ఖర్చు చేయకుండా కుటుంబ భవిష్యత్తుకు పొదుపు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రూపు ఏజెంట్ మాలోత్ రాముడు, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఎస్కే బాజీసైదా, గని మేనేజర్ ఇ. స్వామిరాజు, గ్రూపు ఇంజనీర్ రాజా రవిచరణ్, గని రక్షణాధికారి కొట్టె రమేష్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, పిట్ ఇంజనీర్ రాజగోపాలచారి, ఇంజనీర్ కృష్ణ, సర్వే అధికారి పిచ్చేశ్వర్‌రావు, ప్యానల్ ఇన్‌చార్జి మిట్టపల్లి శ్రీనివాస్, అండర్ మేనేజర్లు శంకరయ్య, పరమేశ్వర్, వెంటిలేషన్ అధికారి చంద్రమౌళి పాల్గొన్నారు.

పదవి విరమణ పొందిన ఉద్యోగికి సన్మానం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-6 గనిలో కోల్ కట్టర్‌గా పనిచేసి పదవి విరమణ పొందిన దుర్గం కృష్ణను గని మేనేజర్ ఇ.తిరుపతి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ మాట్లాడుతూ కార్మికులు సూపర్ న్యుయేషన్ ద్వారా పదవీ విరమణ చేసిన చివరి రోజునే వారికి రావలసిన టర్మినల్ బెనిఫిట్స్‌ను అందజేయాలనే కంపనీ లక్ష్యానికి అనుగుణంగా వారికి గ్రాట్యుటీ, ఎఫ్‌బీఐఎస్(ఆక్యుములేషన్), పెన్షన్ వివరాలను అందజేశారు. వారికి లభించిన టర్మినల్ బెనిఫిట్స్ డబ్బును వారి అవసర మేరకు కొంత భద్రపరచుకుని, మిగిలిన సొమ్మును పొదుపుగా వాడుకోవాలని సూచించారు. వారి సుదీర్ఘ సర్వీసులో రక్షణ సూత్రాలను పాటిస్తూ విధులు నిర్వహించినందుకు అభినందించారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని మిగతా కార్మికులు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమములో రక్షణాధికారి కాదని శ్రీనివాస్, డిప్యూటి మేనేజర్ మర్రి కోమురయ్య, పిట్ ఇంజనీర్ ఎ.శ్యాం కూమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కే సునీల్ కూమార్, ఆండర్ మేనేజర్లు సి.హెచ్ శ్రీనివాస్, శరత్, ఎఐటీయూసీ డిప్యూటి జనరల్ సెక్రటరి ముస్కె సమ్మయ్య, ఫిట్ సెక్రటరి సంగం సదానందం పాల్గొన్నారు.



బీజేపీ మండల అధ్యక్షుడి నియామకం



నవతెలంగాణ-జన్నారం

బీజేపీ మండల అధ్యక్షుడిగా జన్నారం పట్టణానికి చెందిన ఉండవరపు మధుసూదన్‌రావు నియమితులయ్యారు. శనివారం బీజేపీ మంచిర్యాల జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథరావు ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి రజినిష్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రావు మాట్లాడుతూ బీజేపీ మండల అధ్యక్షుడుగా నియమించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రంలో బీజేపీని మరోసారి అధికారంలోకి తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తామన్నారు. బీజేపీ పార్టీ కార్యకర్తలు అంతా తమకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ ఎస్టీ మోర్చ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అజ్మీర బద్రి నాయక్, కొంతం శంకర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బెడద గోపాల్ పాల్గొన్నారు.


పెట్రోల్ బంకులో మోసం తహసీల్దార్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ఓ పెట్రోల్ బంకులో, తక్కువగా పెట్రోల్ పోస్తున్నారని, ఓ కారు యజమాని గట్టు మహేష్, బంకు ఓనర్‌తో శనివారం వాగ్వివాదానికి దిగాడు. మండల కేంద్రంలోని ఓ పాత పెట్రోల్ పంపులో గట్టు మహేష్ ముందుగా తన ఎర్టిగా కారులో రూ.1000 విలువైన పెట్రోల్ పోయించుకున్నాడు. అయినా ఆ కారులో పెట్రోల్ పోసినట్లు ఇండికేటర్ రాలేదు, తన కారును కొంత దూరం నడిపిన తర్వాత కూడా పెట్రోలు పోసినట్లుగా, ఇండికేటర్ రాకపోవడంతో మళ్లీ పెట్రోల్ పంపు దగ్గరికి వచ్చి ఆ యజమానితో తను గొడవకు దిగాడు. పెట్రోల్ పంపు యజమాని మేము పెట్రోల్ పోశామని దబాయించడంతో, సరేనని గట్టు మహేష్ తన ఎర్టిగా కారులో మరల ఫుల్ ట్యాంక్ 4500 పెట్రోల్, పోయించుకున్నాడు. అయితే ఇంతకుముందు పోసిన రూ.1000 పెట్రోల్ ఎటు పోయిందని, బంకు యజమానిని నిలదీశాడు. కారు పెట్రోల్ ట్యాంక్ కెపాసిటీ, 4500 ఉంటే, ఇంతకుముందు పోసిన రూ.1000 పెట్రోల్ ఎటు పోయిందని, అతనితో గొడవకు దిగాడు. బంకు యజమానికి గట్టు మహేష్‌కి తీవ్ర వాగ్వివాదానికి దారితీసింది, బంకు యజమాని చేసిన మోసానికి గట్టు మహేష్ స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

ఆదర్శ కళా సమితి కళాకారులకు న్యాయం చేయండి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ఆదర్శ కళా సమితి కళాకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఆదర్శ కళ సమితి అధ్యక్షుడు లింగంపల్లి రాజలింగం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 374లో గతంలో వారు నిర్మించుకున్న కళా సమితి భవనాన్ని రెవెన్యూ అధికారులు కూల్చివేసిన స్థలాన్ని పరిశీలించారు. 374 సర్వే నెంబర్లు ఉన్న ప్రభుత్వ భూమి ఐదు ఎకరాల 10 గుంటలు ఉండాల్సింది కానీ, కొంతమంది కబ్జాదారులు కబ్జా చేయడంతో కనీసం అది ఇప్పుడు రెండు ఎకరాలు కూడా లేదన్నారు. ఆదర్శ కళా సమితి భవనాన్ని మాత్రం పూర్తిగా కూలగొట్టి, తమకు అన్యాయం చేశారన్నారు. అధికారులు స్పందించి అధర్శ కళా సమితి భవనానికి ఆరు గుంటలు, కళాకారుల ఇళ్ల కోసం, మరో కొంత భూమిని కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆదర్శ కళా సమితి గౌరవ అధ్యక్షులు ఆకుల నరేష్, ఉపాధ్యక్షులు మామిడిపెల్లి అశోక్, ప్రధాన కార్యదర్శి కొండుకూరి రాజు, రమేష్, అంజన్ కుమార్, మనోజ్ కుమార్, సురేష్, రాజన్న పాల్గొన్నారు,

ఉద్యోగ అవకాశం కల్పించాలని సీఎండీకి వినతి



నవతెలంగాణ-నస్పూర్

ఇటీవల సింగరేణిలో విడుదలైన ఎక్స్‌టర్నల్ పోస్టులలో ఐటీఐ వెల్డర్లకు అన్యాయం జరిగిందని, వారికి కూడా ఉద్యోగ అవకాశం కల్పించాలని శనివారం సీఎండీఓ బలరాంను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం సాధించాలని ఐటీఐ వెల్డర్లుగా చేశామని, కానీ సింగరేణి విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వారికి నిరాశ ఎదురైందని వాపోయారు. గత మూడు సంవత్సరాలుగా ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్నామని, ప్రస్తుతం వారి వయసు పరిమితి కూడా దాటిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు ఐటీఐ వెల్డర్లకు అవకాశం కల్పించి, వారి జీవన్మరణ సమస్యను తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీపెల్లి రాజు, వంశీకృష్ణ, రాకేష్, సందీప్, కృష్ణ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం కాగజ్‌నగర్‌లో 5కె రన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తా నుండి ఎస్పీఎం మైదానం వరకు రన్ నిర్వహించారు. దీనిని అదనపు కలెక్టర్ దీపక్ తివారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేరున్న ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఏప్రిల్ 1, 2024 వరకు 18 ఏళ్లు నిండిన వారు ఏప్రిల్ 15వ తేదీలోగా తమ వివరాలు నమోదు చేసుకొని ఓటరు కార్డు పొందాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సురేష్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఉపాధ్యాయులు, వాకర్స్ అసోషియేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.